కోదండరామ్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడం హర్షణీయం


ఎమ్మెల్సీ కోదండరామ్‌తో డ్వాబ్ ప్రతినిధులు

వనస్థలిపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉద్యమకారుడు కోదండరామ్‌ను ఎమ్మెల్సీగా సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్‌కోటాలో నియమించడం హర్షణీయమని అంధుల అభివృద్ధి సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి పొనుగోటి చొక్కారావు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రొ.కోదండరామ్‌ను మర్యాదపూర్వకంగా డ్వాబ్(అంధుల అభివృద్ధి సంక్షేమ సంఘం) ప్రధానకార్యదర్శి, ఏజీసీబీ ఉపాధ్యక్షులు పొనుగోటి చొక్కారావు, కోశాధికారి పరమేష్ ఆదివారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చొక్కారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కోదండరామ్ చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్సీతో గౌరవించడం అభినందనీయం అన్నారు. కోదండరామ్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు.


ఎన్‌టీఆర్‌నగర్‌లో జరిగిన తీజ్‌వేడుకల్లో మహిళలు, బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ తదితరులు

ఎన్‌టీఆర్‌నగర్‌లో తీజ్ వేడుకలు

ఎల్‌బీనగర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం డివిజన్‌లోని ఎన్‌టీఆర్ నగర్‌లో ఆదివారం బంజారా సంఘం ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ ముఖ్యఅతిథిగా హాజరై బంజారాలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం ప్రతినిధులతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.


తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి

అల్మాస్‌గూడలో...

సరూర్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో ఆదివారం స్థానిక బంజారా సంఘం ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి, బంజారాలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బంజారాలు తమ ప్రతిభ, నైపుణ్యంతో అన్ని రంగాల్లో రాణించి సమాజంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని, భవిష్యత్‌లో మరింత ఎత్తుకు ఎదగడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, పలువురు నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ ఆంజనేయ యుద్ధ పద్య నాటకం


పద్యనాటకంలో కళాకారులు

వనస్థలిపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో వనస్థలిపురంలో నిర్వహిస్తున్న నవమి పద్యనాటక పోటీలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అందులో భాగంగా శ్రీరామ కృష్ణ నాట్యమండలి కళాకారులతో ప్రదర్శించిన శ్రీ కృష్ణాంజనేయ యుద్ధం పద్యనాటకం విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శన కనబర్చిన కళాకారులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వీవీ సుబ్బారావు, జడ్డి కృష్ణమూర్తి, పీవీవీ సత్యనారాయణ, పంపన వెంకటేశ్వరరావు, పీవీకే సోమయాజులు, సీహెచ్‌వీఆర్‌కే. మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పబ్‌లో ఇద్దరు యువతులపై దాడి

రాయదుర్గం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్ఎన్ పబ్‌లో ఇద్దరు అమ్మాయిలతోపాటు ఓ వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు అసభ్యకరంగా మాట్లాడి దాడి చేశారు. కొండాపూర్‌కు చెందిన ప్రశాంత్‌కుమార్‌తివారి శనివారం రాత్రి 11.30 గంటలకు ఇద్దరు స్నేహితురాళ్లతో కలిసి కొండాపూర్‌లోని ఎస్ఎల్ఎన్ పబ్‌కు వచ్చాడు. తిరిగి 12.30 గంటలకు ఇంటికి వెళ్లేందుకు కారువద్దకు వచ్చారు. పక్కనున్న నలుగురు యువకులు అమ్మాయిల పట్ల అసభ్యంగా కామెంట్లు చేశారు. ఎందుకు కామెంట్ చేస్తున్నారని తివారి అడుగగా బూతులు తిడుతూ అతడిపై దాడి చేశారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన అమ్మాయిలపైనా దాడిచేసి పరారయ్యారు. దీంతో తివారి గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వృద్ధుల కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్



- త్వరలో అందుబాటులోకి తేవడానికి.. కసరత్తు చేస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల సంక్షేమ కోసం, వారి సమస్యల పరిష్కారానికి రాచకొండ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడానికి సీపీ సుధీర్ బాబు కసరత్తు చేస్తున్నారు. ఈ హెల్ప్‌డెస్క్ అతిత్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిసింది.

● హెల్ప్ డెస్క్ ఉద్దేశం..

ఇటీవల ఎంతో మంది వృద్ధులు నేరస్థుల బారినపడుతున్నారు. గుర్తుతెలియని వ్యక్తుల మాటలు నమ్మి, ఇన్వెస్టిమెంట్, ఇన్సూరెన్స్, కేవైసీ అప్‌డేట్ వంటి తదితర సైబర్ నేరాల బారినపడి రూ.లక్షల్లో పోగొట్టుకుంటున్నారు. అలాంటి సైబర్ నేరాల పట్ల వృద్ధులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.? గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్‌లు వస్తే ఎలా అప్రమత్తం కావాలి..? వెంటనే హెల్ప్‌డెస్క్‌ను ఎలా సంప్రదించాలి..? అనే అంశాలపై అవగాహన కల్పిస్తారు. అందుకోసం సీపీ ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఏదైనా సమస్య వస్తే వెంటనే వెళ్లి తమ బాధను చెప్పుకొని పరిష్కరించుకోవడానికి సరైన వేదికలేక అనేక ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు పోలీసులు అండగా నిలిచి అక్కున చేర్చుకోవాలని సీపీ సంకల్పించారు. నగరంలోని చాలా ఇళ్లలో పిల్లలు ఉన్నతఉద్యోగాలతో విదేశాల్లో స్థిరపడ్డారు. దీంతో ఇళ్లలో వృద్ధులు మాత్రమే ఒంటరిగా కాలం వెళ్లదీస్తున్నారు. వారిని పలకరించి, మేమున్నామనే భరోసా కల్పించే విధంగా హెల్ప్ డెస్క్‌ను తీర్చి దిద్దనున్నట్లు తెలిసింది. రాచకొండ కమిషనరేట్ పరిధిలో హెల్ప్‌డెస్క్‌లను ఎక్కడెక్కడ అందుబాటులోకి తేవాలి..? వృద్ధులు తమ సమస్యలు చెప్పుకోవడానికి ఏ నంబర్‌లో? పోలీసులను ఎలా సంప్రదించాలి..? అనే అంశాలపై సీపీ ప్రత్యేక కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

విప్లవవీరుడు 'సర్వాయి'కి నివాళి

పాపన్నగౌడ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి : ఎమ్మెల్యే సబితారెడ్డి


లింగోజిగూడలో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేందర్‌యాదవ్ తదితరులు


జిల్లెలగూడలో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, మేయర్ దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి తదితరులు

సరూర్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ కుల, మత, జాతి విభేదాలు లేని సమసమాజ స్థాపన కోసం అలుపెరుగని పోరాటం చేశారని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. పాపన్న జయంతిని పురస్కరించుకుని ఆదివారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ చందచెరువు కట్టపై గల ఆయన విగ్రహం వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి, కౌన్సిల్ బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

లింగోజిగూడలో...

ఎల్బీనగర్: శతాబ్దాల కిందటే రాచరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పేద ప్రజలను సంఘటితం చేసి గోల్కొండను ఏలిన ధీశాలి, బహుజన చక్రవర్తి సర్వాయి పాపన్న అని పీసీసీ ప్రతినిధి దేపభాస్కర్‌రెడ్డి అన్నారు. సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని లింగోజిగూడ గౌడ సంఘం వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోయిని మహేందర్‌యాదవ్, రాష్ట్ర యువజన నాయకుడు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, గౌడ సంఘం కార్యదర్శి కందికంటి శ్రీధర్‌గౌడ్, రాజుగౌడ్, జంగారెడ్డి, విజయ్‌కళ్యాణ్‌యాదవ్, నవీకుమార్, సాయి పాల్గొన్నారు.

వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌లో...

వనస్థలిపురం: సర్దార్ సర్వాయి పాపాన్నగౌడ్ జయంతిని వనస్థలిపురం, సాహెబ్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్, ఎల్‌బీనగర్‌లో నిర్వహించారు. పాపాన్నగౌడ్ చిత్రపటానికి వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, బీజేపీ ఎల్బీనగర్ నియోజకవర్గం కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్నగౌడ్, అంబాల మల్లేష్‌గౌడ్, అంతటి వీరస్వామిగౌడ్, పల్లె కృష్ణగౌడ్, పల్లె గణేష్‌గౌడ్, కొత్త వెంకటేష్‌గౌడ్, వెంకటరమణగౌడ్ పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.


వనస్థలిపురంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి, కిరణ్‌గౌడ్ తదితరులు


సాహెబ్‌నగర్‌లో పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న, నాయకులు తదితరులు


ఎల్‌బీనగర్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామ్మోహన్ గౌడ్, వెంకటరమణ గౌడ్ తదితరులు



కొవ్వొత్తుల ప్రదర్శనలో పీడీఎస్‌యూ నేతలు, విద్యార్థులు

కోల్‌కతా ఘటనకు నిరసనగా పీడీఎస్‌యూ కొవ్వొత్తుల ప్రదర్శన

చాదర్‌ఘాట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ ఘటనను నిరసిస్తూ పీడీఎస్‌యూ గ్రేటర్ కార్యవర్గం ఆధ్వర్యంలో శనివారం రాత్రి ముసారాంబాగ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనను పీడీఎస్‌యూ తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, గ్రేటర్ అధ్యక్షుడు మంద నవీన్ తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పాలకులు మహిళల సాధికారతే ధ్యేయం అంటూ బేటీ బచావో బేటీ పడావో అనే నినాదాన్ని ఇస్తూ మరోవైపు వీటిని తుంగలో తొక్కుతున్నాయని విమర్శించారు. మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు, మర్డర్లు జరుగుతున్నా ఎలాంటి చలనం లేదన్నారు. వీరికి మహిళలపై ఎలాంటి చిత్తశుద్ధి ఉందో కోల్‌కత్తా ఘటననే నిదర్శనమన్నారు. ఈ అఘాయిత్యానికి పాల్పడిన దుండగులను వెంటనే శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర నాయకులు శ్యామ్, ఝాన్సీ, రమ్య తదితరులు పాల్గొన్నారు.


సైదాబాద్‌లో కొవ్వత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండిస్తూ ర్యాలీ

సైదాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి, ఆలయాల ధ్వంసం చేయడాన్ని వ్యతిరేకిస్తూ సైదాబాద్ ప్రాంత గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బీజేపీ నేతలు కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. గణేష్ చౌక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ సైదాబాద్ ప్రధాన రహదారి గుండా కొనసాగింది. ఈ సందర్భంగా బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ హిందుత్వ జాతీయవాద శక్తులు జాగృతం కావాలని పిలుపునిచ్చారు. దాడులకు పాల్పడుతున్న అల్లరిమూకలను కఠినంగా అణిచి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్ బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్తకాపు రవిందర్‌రెడ్డి, లింగాల హరిగౌడ్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు రమణ్‌సింగ్, నాయకులు నర్సింహచారి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల వేడుకలు

సైదాబాద్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నీలం రాజశేఖర్‌రెడ్డి నగర్(చింతల్‌బస్తీ)లో శ్రావణమాస బోనాల ఉత్సవాల సంబరాలు ఆదివారం ఘనంగా జరిగాయి. పోతరాజుల నృత్యాలు, డప్పు వాయిద్యాల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ ఉత్సవాలకు భాగ్యనగర్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు కృష్ణ, శేఖర్, మహేష్, యాదయ్య రవి, వెంకటేష్, వినోద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి తదితరులు


మంత్రి కొండా సురేఖను కలిసిన శ్రీహనుమాన్ దేవస్థానం ఈవో ఎన్.లావణ్య, చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ధర్మకర్తలు

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఆహ్వానం

చంపాపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీహనుమాన్ దేవస్థానంలో ఈనెల 19న నిర్వహించనున్న వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ముఖ్యఅతిథిగా విచ్చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖను ఆహ్వానించారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈవో ఎన్.లావణ్య, ధర్మకర్తలు మంత్రికి ఆహ్వానపత్రాన్ని ఆదివారం అందజేశారు. అలాగే మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్‌ను కూడా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు మేక సురేందర్‌రెడ్డి, మధుసూదన్‌సాగర్, బిల్లకంటి కిరణ్‌కుమార్, మేకల యాదగిరి, బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, సాంబరాజు శైలజ, ఆలయ వేదపండితులు ఆర్.చంద్రకాంత్‌శర్మ, సీహెచ్.ముత్యాలశర్మ, అర్చకుడు శ్రవణ్‌కుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన పూజలో కార్పొరేటర్ పవన్‌కుమార్

శ్రీనల్ల పోచమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎస్ఆర్ఎల్ కాలనీ సమీపంలో ఆదివారం తోట నర్సింహయాదవ్, తోట సత్యమ్మ యాదవ్ దంపతులు శ్రీనల్ల పోచమ్మ నూతన ఆలయ నిర్మాణ శంకుస్థాపన పూజలు నిర్వహించారు. కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అమ్మవారి పురాతన గుడిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో నందుయాదవ్, రాహుల్ యాదవ్, సంపత్ యాదవ్, తోట మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

24న గ్రాండ్ జాబ్ మేళా

చాదర్‌ఘాట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులైన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పర్యవేక్షణలో ఈనెల 24న గ్రాండ్ జాబ్‌మేళా నిర్వహించనున్నారు. 60కి పైగా ఐటీ కంపెనీలు, నాన్ ఐటీ కంపెనీలు, ఫార్మా, హెల్త్ కేర్, ఆటో మొబైల్, ఇతర కంపెనీలకు చెందిన ప్రతినిధులు గ్రాండ్ జాబ్‌మేళాలో పాల్గొని అర్హులైన నిరుద్యోగులను ఎంపిక చేసుకోనున్నారు. చాదర్‌ఘాట్‌లోని గ్రాండ్ ఇంపీరియల్‌లో జరగనున్న ఈ మేళా ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు కొనసాగనుంది.


లక్ష్మీనగర్ కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

లక్ష్మీనగర్‌లో 14 అడుగుల వినాయక విగ్రహం

సైదాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 14 అడుగుల ఎత్తు గల భారీ గణేశుడి విగ్రహం సిద్ధమైనట్లు కమిటీ ప్రతినిధులు సీఎస్ రెడ్డి, బాలకృష్ణ గురుస్వామి తెలిపారు. ఆదివారం లక్ష్మీనగర్‌లోని గోసేవా ఫౌండేషన్ కార్యాలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలలో ప్రతి రోజూ భజనలతో పాటు ప్రత్యేక భక్తి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని వివరించారు. ఈ సమావేశంలో కొండల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, అజయ్, శ్రీధర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ విదేశీ విద్య స్టైఫండ్ ఇవ్వాలి

రాంనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ విదేశీ విద్య స్టైఫండ్ ఇవ్వాలని, బీసీలకు 300 మందికి కాదు 2 వేల మందికి ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో కృష్ణయ్య మాట్లాడుతూ.. ఒక శాతం జనాభా గల బ్రాహ్మణులకు 100 మందికి విదేశీ విద్య స్టైఫండ్ ఇస్తున్నారని, 52 శాతం జనాభా గల బీసీలకు 300 మందికి ఇవ్వడం శోచనీయమన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి అర్హత గల వారందరికీ విదేశీ విద్య స్టైఫండ్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు వేముల రామకృష్ణ, సి. రాజేందర్, సతీష్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇళ్లల్లోకి వరద

- పైకాలనీల నుంచి వస్తున్న వరదనీరు
- అవస్థలు పడుతున్న మహాలక్ష్మీకాలనీవాసులు


కాలనీలో నిలిచిన వరదనీరు


మహాలక్ష్మీకాలనీలో ఇంట్లోకి చేరిన వరదనీరు

వనస్థలిపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న ఆకాల వర్షాలకు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని శివారు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పై కాలనీల నుంచి వస్తున్న వరదనీరు దిగువ ప్రాంతాలకు వెళ్లకుండా బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని మహాలక్ష్మీకాలనీని ఆనుకుని ఉన్న సదరు వ్యవసాయ భూమి యజమానులు అడ్డుగోడ నిర్మించారు. దీంతో దిగువ ప్రాంతానికి సాఫీగా వెళ్లాల్సిన వరదనీరు కాలనీలోని ఇళ్లల్లోకి చేరుతుండడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వరద సమస్యను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్‌ను కాలనీవాసులు కలిసి కోరారు. ఈ మేరకు శనివారం కార్పొరేటర్ లచ్చిరెడ్డి కాలనీలో పర్యటించి సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సంబంధిత మున్సిపల్ అధికారులను సైతం కాలనీవాసులు కలిసి కాలనీలోని వరదనీటి సమస్యను పరిష్కరించి తమ రాకపోకలకు ఆటంకాలు కలగకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందజేశారు.


మోకాళ్లలోతు వరదనీటిలో రాకపోకలు సాగిస్తున్న కాలనీవాసులు

కానీ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి పైకాలనీల నుంచి వస్తున్న వరదనీరు కాలనీలో అప్పటికే నిలిచిన వర్షపు నీరు ఉండడంతో వరద ఉధృతి ఎక్కువైంది. దీంతో కాలనీలోని ఇళ్లలోకి వరదనీరు చేరుతోంది. మరోపక్క కాలనీవాసులు రాకపోకలకు తీవ్రఇబ్బందు లు పడుతున్నారు. మోకాళ్లలోతు వరదనీటిలో నుంచే రాకపోకలను సాగిస్తున్నారు. ఆదివారం సాయంత్రం వరకు కూడా వరదనీరు తగ్గుముఖం పట్టలేదు. వరద ఉధృతి ఇంకా పెరిగితే మరిన్ని ఇళ్లలోకి వదరనీరు చేరే ప్రమాదం పొంచి ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కార్పొరేటర్, సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని వరదనీరు సాఫీగా వెళ్లడానికి అడ్డంగా ఉన్న గోడను తక్షణమే తొలగించాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

హయత్‌నగర్‌లో అరగంట భారీ వర్షం

హయత్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఉదయం నుంచి భారీగా కాచిన ఎండ, ఉక్కపోత, మధ్యాహ్నానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. 2.30 గంటల నుంచి 3 గంటల వరకు కుండపోతగా భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. హయత్‌నగర్‌లో విజయవాడ జాతీయ రహదారిపైన పుల్లారెడ్డి స్వీట్ హౌస్ వద్ద రోడ్డుపైన వర్షం నీరు చేరి చెరువును తలపించింది. దీంతో తీవ్ర ట్రాఫిక్ జాం ఏర్పడింది. విస్తరించిన రోడ్డుపైన కూడా నీరు చేరడడంతో పెద్ద చెరువులా కనిపించింది. దాదాపు అరగంట పాటు వర్షం కురిసింది. హయత్‌నగర్ కోర్టు, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం, ఫైర్‌స్టేషన్ గుండా భారీగా వరద నీరు వచ్చింది. అదేవిధంగా టీడీఎల్ కాలనీ, భాగ్యలత మీదుగా వర్షం నీరు భారీగా ప్రవహించింది.


పుల్లారెడ్డి స్వీట్ హౌస్ వద్ద చెరువును తలిపిస్తున్న విజయవాడ జాతీయ రహదారి